

# పారిశ్రామికం వెలవెల!

**తెలంగాణలో కంపెనీలు పెట్టాలంటేనే హడల్**

- ఐదేండ్ల కనిష్ట స్థాయికి పడిపోయిన కంపెనీల నమోదు
- బీఆర్ఎస్ హయాంతో పోల్చితే 12 శాతానికిపైగా తగ్గుదల
- కేంద్ర కంపెనీ వ్యవహారాల శాఖ త్రైమాసిక నివేదికలో వెల్లడి
- కాంగ్రెస్ సర్కారుపై పెట్టుబడిదారుల్లో సడలుతున్న నమ్మకం

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక రంగం వెలవెలబోతున్నది. కొత్తగా కంపెనీలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడంలేదు. పదేండ్ల పాటు దేశానికి ఏ కంపెనీ వచ్చినా ముందుగా తెలంగాణ రాష్ట్రానికి ప్రాధాన్యతనివ్వగా, రేవంత్ ప్రభుత్వపాలనలో ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కాంగ్రెస్ సర్కారు పట్ల పెట్టుబడిదారుల్లో నమ్మకం సడలింది. కేంద్ర కంపెనీ వ్యవహారాల శాఖ తాజా నివేదికలో వెల్లడించిన గణాంకాలే ఇందుకు నిదర్శనం.

### కంపెనీల ఏర్పాటుకు 'నై'

2023 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంతో పోల్చుకుంటే 2024 జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో తెలంగాణవ్యాప్తంగా కంపెనీల నమోదులో గణనీయమైన తగ్గుదల నమోదైంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో కంపెనీల ఏర్పాటు గతంతో పోలిస్తే ఏకంగా 12.4 శాతం మేర తగ్గింది. ఐదేండ్లలో ఇదే కనిష్ఠం. ఈ మేరకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ తాజా నివేదికలో వెల్లడైంది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, ఈశాన్యంలోని అతిచిన్న రాష్ట్రం మణిపూర్ ఈ విషయంలో గణనీయమైన పురోగతి సాధించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ కూడా కొత్త కంపెనీల ఏర్పాటులో స్థిరత్వాన్ని నమోదు చేసింది.

### గతం ఎంతో ఘనం

రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎదిగింది. అమెజాన్, టీసీఎస్, డెలాయిట్, ఇన్ఫోసిస్, యాక్సెంచర్, విప్రో, మైక్రోసాఫ్ట్, ఐబీఎం వంటి కంపెనీలు అతి పెద్ద కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకున్నాయి. నోవార్టీస్, జీఎస్కే, డాక్టర్.రెడ్డీస్ ల్యాబ్స్, అరబిందో, హెటిరో వంటి ఔషధ కంపెనీలు, ఆల్పాలాన్, బ్యాంగ్రోన్, బెండిట్ వంటి లైఫ్ సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు చేపట్టాయి. ఔషధ కంపెనీలకు కేంద్రంగా ఉన్న జీనోమ్‌వ్యాలీని కేసీఆర్ సర్కారు గణనీయంగా విస్తరించడమే కాకుండా వైద్య పరికరాల కోసం సుల్తాన్‌పూర్‌లో ప్రత్యేకంగా మెడికల్ డివైజెస్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ కండ్ల జోళ్లు, ఎక్స్‌రే మిషన్ల దగ్గర్నుంచి ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలకు ఎగుమతి చేసే స్టెంట్ల తయారీ పరిశ్రమ కూడా తమ కార్యకలాపాలు చేపట్టింది. వస్త్ర పరిశ్రమల్లో ఎంగ్‌వన్, కిటెక్స్ వంటి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేశాయి. ఇలా పదేండ్లలో దేశానికి ఏ పెట్టుబడి వచ్చినా ముందుగా తెలంగాణను సందర్శించి, ఇక్కడ పరిస్థితులను అధ్యయనం చేయకుండా ఉండలేదంటే రాష్ట్ర పారిశ్రామికరంగం ఏ స్థాయికి ఎదిగిందో ఊహించుకోవచ్చు.

### ఇదీ కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'మార్పు': హరీశ్

"రాష్ట్రంలో కంపెనీల నమోదులో గణనీయంగా తగ్గుదల నమోదు కావడం కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 'మార్పు'. కంపెనీలు తగ్గడం వల్ల ఆ ప్రభావం చాలా ఇతర అంశాలపై ప్రతికూల పడుతుంది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తగ్గుతాయ. పన్నుల రాబడి కూడా తగ్గిపోతుందని తెలిపారు. స్టార్టప్ తెలంగాణలో భాగంగా రాష్ట్రంలో ఆంత్రప్రెన్యూర్‌షిప్‌ను, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నప్పటికీ... కంపెనీల తగ్గుదల చూస్తుంటే సీఎం తన లక్ష్యసాధనలో విఫలమైనట్లు స్పష్టమవుతున్నది."

# పెట్టుబడుల్లో తెలంగాణ ఎక్కడ?

- దూసుకుపోతున్న రాష్ట్రాలకు అభినందనలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ రాష్ట్రాల
- పెట్టుబడులపై 'ఇండియన్ టెక్, ఇన్‌ఫ్రా' జాబితా
- స్వచ్ఛబయో, అదానీ కంపెనీల పెట్టుబడులు
- పరిగణనలో లేవా? అంటూ కేటీఆర్ ఎద్దేవా



హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : పెట్టుబడుల్లో తెలంగాణ ఎక్కడున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తాజాగా ఇండియన్ టెక్ అండ్ ఇన్‌ఫ్రా అనే సంస్థ దేశవ్యాప్తంగా పెట్టుబడుల్లో టాప్ 10లో ఉన్న రాష్ట్రాల పెట్టుబడుల జాబితాను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి, ద్వితీయ త్రైమాసికాల జాబితాను విడుదల చేసింది. ఆయా రాష్ట్రాలకు వచ్చిన ప్రాజెక్టులు, వాటి ద్వారా ఆయా రాష్ట్రాలకు ఎన్నివేల కోట్ల పెట్టుబడులు, జాతీయస్థాయిలో ఆ రాష్ట్ర పెట్టుబడుల వాటా ఎంత? అనే వివరాలను ఆ సంస్థ పోస్ట్ చేసింది. ఇండియన్ టెక్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ విడుదల చేసిన జాబితాను కేటీఆర్ ట్యాగ్ చేస్తూ పెట్టుబడుల్లో దూసుకుపోతున్న రాష్ట్రాలను అభినందించారు. మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు శుభాకాంక్షలు తెలిపారు. అదే సమయంలో తెలంగాణ పెట్టుబడుల్లో వారు (ఇండియన్ టెక్ ఇన్‌ఫ్రా) స్వచ్ఛబయో, అదానీ పెట్టుబడులను పరిగణనలోకి తీసుకోలేదా? అని ఎద్దేవా చేశారు. ఫ్రెష్ ప్రాజెక్ట్స్ టాప్ 10 పేరుతో మొదటి, ద్వితీయ త్రైమాసికాలకు సంబంధించి సదరు సంస్థ విడుదల చేసిన రాష్ట్రాలు, ప్రాజెక్టులు, వాటి ద్వారా వచ్చిన పెట్టుబడులు తదితర వివరాలిలా ఉన్నాయి.

**2024-25 తొలి త్రైమాసికంలో ఫ్రెష్ ప్రాజెక్ట్స్ టాప్ 10 స్టేట్స్**

| రాష్ట్రం | ప్రాజెక్టులు | రూ. (కోట్లలో) | వాటా(శాతం) |
|---|---|---|---|
| మహారాష్ట్ర | 614 | 1,35,055.07 | 20.90 |
| ఉత్తరప్రదేశ్ | 146 | 53,401.32 | 8.26 |
| హర్యానా | 71 | 52,762.07 | 8.16 |
| ఒడిశా | 70 | 41,571.55 | 6.43 |
| గుజరాత్ | 249 | 41,256.29 | 6.38 |
| రాజస్థాన్ | 117 | 37,021.58 | 5.73 |
| కర్ణాటక | 190 | 34,968.98 | 5.41 |
| ఛత్తీస్‌గఢ్ | 31 | 33,738.72 | 5.22 |
| తెలంగాణ | 104 | 26,762.78 | 4.14 |
| తమిళనాడు | 111 | 25,299.83 | 3.91 |
| దేశంలో.. | 2,443 | 6,46,293.83 | 100 |



**2024-25 ద్వితీయ త్రైమాసికంలో ఫ్రెష్ ప్రాజెక్ట్స్ టాప్ 10 స్టేట్స్**

| రాష్ట్రం | ప్రాజెక్టులు | రూ. (కోట్లలో) | వాటా(శాతం) |
|---|---|---|---|
| మహారాష్ట్ర | 661 | 2,80,856.02 | 30.49 |
| గుజరాత్ | 314 | 1,38,771.85 | 15.07 |
| కర్ణాటక | 264 | 87,740.04 | 10.61 |
| తమిళనాడు | 172 | 46,662.04 | 5.07 |
| ఉత్తరప్రదేశ్ | 170 | 40,183.95 | 4.36 |
| రాజస్థాన్ | 123 | 39,019.24 | 4.24 |
| మధ్యప్రదేశ్ | 69 | 36,930.39 | 4.01 |
| తెలంగాణ | 108 | 29,753.19 | 3.23 |
| ఒడిశా | 63 | 26,536.21 | 2.88 |
| కశ్మీర్ | 37 | 18,591.84 | 2.02 |
| దేశంలో.. | 2,684 | 9,21,081.08 | 100.00 |

# పెట్టుబడులు రావట్లే!

- పెట్టుబడుల్లో టాప్-8 లిస్టులో అట్టడుగున తెలంగాణ
- మనకంటే చాలా మెరుగ్గా ఒడిశా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): పెట్టుబడుల సాధనలో గడచిన పదేండ్లలో దేశంలోనే అగ్రస్థానంలో ఉంటూ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన తెలంగాణలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఖ్యాతి మసకబారుతున్నది. రియల్ ఎస్టేట్, పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్య అవకాశాలు, సులభతర వాణిజ్యం వంటి సూచీల్లో ఇప్పటికే గత వైభవాన్ని కోల్పోయిన తెలంగాణ.. పెట్టుబడులకు సంబంధించిన సూచీలోనూ టాప్-8 రాష్ట్రాల జాబితాలో అట్టడుగున నిలవడం ఆందోళన కలిగిస్తున్నది.

### మిగతా రాష్ట్రాల కంటే దారుణంగా

2024-25లో తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్) దేశవ్యాప్తంగా 5,127 ప్రధాన ప్రాజెక్టుల ద్వారా వివిధ రాష్ట్రాల్లో రూ. 15,67,374.91 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. ఇందులో దాదాపు 25% ప్రాజెక్టులు, మరో 25% పెట్టుబడులు మహారాష్ట్రకే తరలివెళ్లాయి. ఏడాది క్రితం వరకు పెట్టుబడులకు స్వర్గధామంగా నిలిచిన తెలంగాణలో ఈ ఆరు నెలల్లో 212 ప్రాజెక్టులే వచ్చాయి. దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం ప్రాజెక్టుల్లో ఇది కేవలం 4.13 శాతమే. ఆరు నెలల్లో కేవలం రూ. 56,515.97 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. ఇది 3.60 శాతంతో సమానం. వెరసి ఈ జాబితాలో తెలంగాణ 8వ స్థానానికి పరిమితమైంది. పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల కల్పనలో కొన్ని నెలల క్రితం వరకు గడ్డ పరిస్థితిలో ఉన్న ఒడిశా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు తెలంగాణను దాటుకుని జాబితాలో మెరుగైన ర్యాంకును సాధించాయి.

**తెలంగాణ ఎక్కడ? (ఏప్రిల్-సెప్టెంబర్)**


దేశవ్యాప్తంగా మొత్తం పెట్టుబడులు **రూ. 15,67,374.91 కోట్లు**

తెలంగాణలో పెట్టుబడులు **రూ. 56,515.97 కోట్లు**

దేశంలోని పెట్టుబడుల్లో వాటా **3.60%** | **8** ర్యాంక్ (అట్టడుగు ర్యాంకు)

### కాంగ్రెస్ సర్కారు ప్రతికూల నిర్ణయాలు

సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలే పెట్టుబడులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపినట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్టు ప్రకటించి పారిశ్రామిక వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం షాకిచ్చింది. దాదాపు అన్ని అనుమతులు వచ్చి.. పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న 16 వేల ఎకరాల ఫార్మా సిటీని రద్దు చేయడమేంటని అప్పుడే పారిశ్రామికవర్గాలు ఆశ్చర్యంవ్యక్తం చేశాయి. అనంతరం హైడ్రా పేరిట కూల్చివేతలు చేపట్టడం రియల్‌ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేసింది. ఇది కూడా కొత్త పెట్టుబడులకు ప్రతిబంధకంగా మారింది. ఇక ఎంఎస్ఎంఈ లకు కొత్త విధానాన్ని తెస్తామంటూ 8 నెలలు కాలయాపన చేసిన సర్కారు తీరిగ్గా గత నెలలో పాలసీని ప్రకటించింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవసరమైన సులభతర వాణిజ్యానికి ఈ పాలసీ అంతగా మేలు చేసేలా లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




### కుట్రలింకా ఆగిపోలేదు

మొదటిపేజీ తరువాయి...

గురికావొద్దని, ఆగం కావాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ప్రజల పక్షాన నిలబడాలన్న పట్టుదలను బీఆర్ఎస్ విరమించుకుంటుందనేది కాంగ్రెస్ సర్కార్ కుటిల యత్నమని, ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటం నుంచి పక్కకు తప్పుకోవద్దని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం చేస్తున్న పోరాటం నుంచి తమ దృష్టిని, మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అవినీతిని, అసమర్థతను ఎత్తిచూపుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు, అందులో భాగమైన 420 హామీల అమలు కోసం ఒత్తిడి చేస్తూనే ఉంటామని తేల్చిచెప్పారు.

# డిస్కంల తప్పిదం.. జనంపై భారం

- సకాలంలో ఏఆర్ఆర్‌లు సమర్పించని డిస్కంలు
- ఆ భారం మళ్లీ వినియోగదారులపైనే

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థలు (డిస్కంలు) చేస్తున్న పొరపాటు రాష్ట్రంలోని విద్యుత్తు వినియోగదారులకు గ్రహపాటుగా మారుతున్నాయి. డిస్కంల తప్పిదంతో అంతిమంగా వినియోగదారులపై భారం పడుతున్నది. సకాలంలో అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్ (ఏఆర్ఆర్) ప్రతిపాదనలను సమర్పించడంలో విఫలమవుతుండటంతో ఈఆర్సీ జరిమానాలు విధిస్తున్నది. రాబడికి కోతపెడుతున్నది. ఈ భారం మళ్లీ వినియోగదారులపైనే మోపాల్సి వస్తున్నది. అయితే ఈసారి రాబడికి కోత విషయంలో ఈఆర్సీ కాస్త పెద్దమనసు చేసుకుంది. ఐదేండ్ల రాబడికి కోత విధించాల్సి ఉండగా, కేవలం ఒక్క ఏడాది రాబడి కోతకు పరిమితం చేసింది. నిబంధనలు పాటించకుండా డిస్కంలు జనవరిలో కాకుండా 8 నెలలు ఆలస్యంగా ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో ఈఆర్సీకి పిటిషన్లను సమర్పించాయి. రాబోయే ఐదేండ్ల కాలానికి ఏడాదికి రూ. 582 కోట్ల చొప్పున ఐదేండ్లకు రూ.2,500 కోట్ల రాబడిని కోల్పోయే అవకాశం ఉంది. జెన్‌కో రూ.396 కోట్లు, ట్రాన్స్‌కో అండ్ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు రూ. 119 కోట్లు, డిస్కంలకు రూ. 62 కోట్లు, డిస్కంల రిటైల్ వ్యాపారంలో రూ. 7 కోట్ల చొప్పున ఈఆర్సీ కోత పెట్టింది. ఏఆర్ఆర్ సమర్పణలో ఆలస్యమైనందున డిస్కంలకు నెలపాటు రోజుకు రూ. 5 వేలు, ఆ తర్వాత రోజుకు రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తున్నది. దీంతో ఈఆర్సీ కోటిన్నర జరిమానా విధించింది.